# సెంటిమెంట్‌తో కడుపులు నిండవు



వీణవంక: వల్భాపూర్ ప్రచారంలో అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు

- 7 సార్లు గెలిచిన ఈటల చేసిందేమీ లేదు
- ₹వెయ్యి కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తా
- 15 ఏండ్లుగా ప్రజల సేవలో ఉన్నా
- హుజూరాబాద్ గడ్డపై గులాబీ బొట్టు పెట్టాలి
- మీ బిడ్డను.. ఒక్క అవకాశం ఇవ్వండి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి
- ఉప్పెనలా కదిలిన ఊరువాడా

వీణవంక/ జమ్మికుంట, నవంబర్ 2: 'సెంటిమెంట్ డైలాగులు కొట్టి ఈటల రాజేందర్ ఎమ్మెల్యేగా గెలిచారు.. వాటితో పేదల కడుపులు నిండవు.. ఏడు సార్లు గెలిచిన ఆయన నియోజకవర్గానికి చేసిందేమీ లేదు.. బీసీ బంధును ఆపారు.. కాంగ్రెస్ నాయకులేమో దళితబంధు, రైతుబంధును ఆపించారు.. ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి.. నేను మీ బిడ్డను.. ఒక్క అవకాశం ఇవ్వండి.. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తాను' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 15 ఏండ్లుగా ప్రజలకు సేవ చేస్తున్నానని, ఎన్నికల్లో ఆశీర్వదిస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. గురువారం మండలంలో ప్రచార శంఖారావాన్ని పూరించారు. మొదట బేతిగల్‌లోని పెద్దమ్మతల్లి, రామాలయంలో సతీసమేతంగా పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. మండలంలోని బేతిగల్, కనపర్తి, నర్సింగాపూర్, వల్భాపూర్‌లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. బేతిగల్ నుంచి పోతిరెడ్డిపేటకు రోడ్డు, పోచమ్మతల్లి గుడి నిర్మాణం, భూలక్ష్మీ–మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠ చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జమ్మికుంట మండలం జగ్గయ్యపల్లి, పెద్దంపల్లి, మాచనపల్లి, ఆబాది జమ్మికుంటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు పల్లెల్లో రైతుల పరిస్థితి ఎలా ఉండేదో ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. కరెంట్ ఎప్పుడూ వస్తదో, ఎప్పుడూ పోతదో తెలువక రాత్రిపూట కరెంట్ మోటర్ల కాడికి పోతే పాములు, తేళ్లు కుట్టి, కరెంట్ షాకులతో ఎంత మంది మృతిచెందారో, ఎన్ని కుటుంబాలు రోడ్డున పడ్డాయో, పంట పెట్టుబడి కోసం వడ్డీలకు తీసుకొచ్చి అప్పులు పాలైన రోజులను ఓసారి గుర్తు చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి, హుజూరాబాద్ గడ్డకు గులాబీ బొట్టు పెట్టాలని పిలుపునిచ్చారు. కాగా, గ్రామాల్లో కౌశిక్‌రెడ్డి ప్రచారానికి ప్రజలు ఉప్పెనలా తరలివచ్చారు. ప్రతి గ్రామంలో మహిళలు, గ్రామస్తులు మంగళహారతులతో, డప్పుచప్పుళ్లతో, పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. పాడి కౌశిక్‌రెడ్డి–శాలినీరెడ్డి దంపతులు ప్రజల్లోకి వెళ్లి పేరుపేరున నమస్కరిస్తూ ఓటు అభ్యర్థించారు.

**ఈటల ముఖం ఎప్పుడైనా కనబడిందా: గెల్లు శ్రీనివాస్‌యాదవ్**

ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ గెలిచి రెండేండ్లు అయిందని, ఇప్పటివరకు ఎప్పుడైనా ముఖం చూపించిండా..? అని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ ప్రజలను ప్రశ్నించారు. ఉప ఎన్నికలప్పుడు కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకొని ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రాలు పట్టుకొని తిరుగుతున్నడని విమర్శించారు. ప్రజల కష్టాలు పట్టనోడు ఓట్లు ఎలా అడుగుతాడని, నిత్యం మన మధ్యలో ఉండే ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశంలోనే సీఎం కేసీఆర్ గొప్ప నాయకుడని, అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. కాగా, ప్రచారంలో పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి ఆయన సతీమణి శాలినీరెడ్డి పాల్గొన్నారు. తన భర్తకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కొంగు చాపి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుకాతిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాలాసాధవతరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలకిషన్‌రావు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, సర్పంచులు మోరె సారయ్య, పర్లపెల్లి రమేశ్, గంగాడి సౌజన్యాతిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు జడల పద్మలతారమేశ్, ఉపసర్పంచులు చొప్పరి తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, కవితాశ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, పత్తి కొండల్‌రెడ్డి, శశికుమార్, సింగిల్‌విండో డైరెక్టర్ కామిడి కావ్యాశ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జి.రవీందర్‌రావు, రాజమౌళి, రాజేశ్వర్‌రావు, పర్లపెల్లి తిరుపతి, కర్నె నర్సయ్య, వెంకటరాజం, జీడి వెంకటస్వామి, తిరుపతి, తిరుపతిరెడ్డి, సత్యనారాయణ, జమ్మికుంట ఎంపీపీ దొడ్డె మమతాప్రసాద్, జడ్పీటీసీ శ్రీరామ్ శ్యామ్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, సర్పంచులు వంశీధర్‌రావు, అన్నపూర్ణ, కల్పన, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్

# అభివృద్ధికి కేరాఫ్ చొప్పదండి

- కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- ఎన్నికల్లో మరోసారి దీవించండి
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- పట్టణంలోని 1,2,3వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం

చొప్పదండి, నవంబర్ 2: ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి రూ.100 కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గ కేంద్రం చొప్పదండిని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దానని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని 1, 2, 3వ వార్డుల్లో గురువారం సాయంత్రం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం తెలంగాణ చౌరస్తావద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, చొప్పదండి నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎందరో నాయకులు ఎమ్మెల్యేగా గెలిచి వెళ్లారే తప్ప.. పట్టణంలో తట్టెడు మట్టి కూడా తీయలేదని, స్థానికుడినైన తాను ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అనేక అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదని విమర్శించారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ సీఎం అయ్యాక తొమ్మిదేండ్లలో అన్ని వర్గాలకు మేలు జరిగిందని, రైతుబంధు పథకంతో అన్నదాతల బతుకుల్లో వెలుగులు నింపిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి కాంగ్రెసోళ్ల కడుపు, కాషాయపోళ్ల కండ్లు మండుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు, ఉచిత కరెంటు రెండూ బంద్ అవుతాయని.. ప్రజలు తెలుసుకొని ఆలోచన చేసి ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కర్ణాటక లెక్క కటకట అవుతుందని, టార్చ్‌లైట్ పట్టుకొని, పొలాల దగ్గరికి వెళ్లి కరెంటు పెట్టుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య–వినయ్, సింగిల్ విండో చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, మాజీ ఎంపీపీలు గుర్రం భూమారెడ్డి, వల్లాల కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్లు మాడూరి శ్రీనివాస్, మహేశుని సంధ్య–మల్లేశం, వడ్లూరి గంగరాజు, సర్పంచులు పెద్ది శంకర్, విద్యాసాగర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు పాషా, నాయకులు నలుమాచు రామకృష్ణ, వెంకటరమణారెడ్డి, నారాయణరావు, గాండ్ల లక్ష్మణ్, పెద్దెల్లి అనిల్, కొత్తూరి నరేశ్, మహిళలు పాల్గొన్నారు.

# 'పాడి'ని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- ఎన్నికల ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి సహా ముఖ్య నాయకులతో సమావేశం



ముఖ్య నాయకులతో సమావేశమైన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, హుజూరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 2: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని, పార్టీ హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. గురువారం రాత్రి హుజూరాబాద్‌లోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి నివాసంలో ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని రచించారు. పోలింగ్ బూత్ స్థాయిలో కార్యకర్తలను అప్రమత్తంగా ఉంచాలని, ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మమేకం కావాలని సూచించారు. క్రమశిక్షణ కలిగిన బీఆర్ఎస్ పార్టీ నాయకులుగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని వినోద్‌కుమార్ సూచించారు. ప్రతిపక్షాల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తిప్పి కొట్టాలని, ఎవరికీ ఎలాంటి అవకాశం ఇవ్వద్దని వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ హుజురాబాద్, హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ముఖ్య నాయకులు వర్ధినేని రవీందర్‌రావు, పొనగంటి మల్లయ్య, వడ్లూరి విజయ్‌కుమార్, కొలిపాక శ్రీనివాస్, కన్నెబోయిన శ్రీనివాస్‌యాదవ్, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలి

**ఎస్ఈసీ పార్థసారథి**

కలెక్టరేట్, నవంబర్ 2: 2024లో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి అన్నారు. గురువారం కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు, తదితర అంశాలపై కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో కె.మహేశ్వర్‌తో సమీక్షించారు. సమావేశంలో జిల్లాలోని రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథికి మొక్క అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

# బీఆర్ఎస్‌లో చేరిన వైఎస్ఆర్‌సీపీ నగర యూత్ అధ్యక్షుడు



మంత్రికి చిత్రపటాన్ని బహూకరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నగర యువత అధ్యక్షుడు తోట కిరణ్‌కుమార్

కార్పొరేషన్, నవంబర్ 2: కరీంనగర్ వైఎస్ఆర్‌సీపీ నగర యూత్ అధ్యక్షుడు తోట కిరణ్‌కుమార్ గురువారం మంత్రి నివాసంలో మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో యువత కూడా బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యువత పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. యువత భవిష్యత్తు బాగులంటే మరోసారి బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. పార్టీలో చేరిన వారిలో సతీశ్, శ్రావణ్, హరికృష్ణ, సంతోష్, రవి, వెంకట్, సాగర్, సాయి, ప్రసాద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, నాయకులు చందు, సతీశ్ పాల్గొన్నారు.

# సబ్ స్టేషన్లను పరిశీలించిన సీజీఎం



సబ్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీజీఎం అశోక్ కుమార్

ముకరంపుర, నవంబర్ 2: నగరంలోని 32/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లను గురువారం ఎన్పీడీసీఎల్ సీజీఎం బీ అశోక్ కుమార్ తనిఖీ చేశారు. 33/11కేవీ అంబేడ్కర్ నగర్, భగత్ నగర్, ఉజ్వల పార్కు సబ్ స్టేషన్ల నిర్వహణ తీరుకు సంబంధించి రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. నిర్మాణాలకు పెయింటింగ్ చేయించాలని, బ్రేకర్లకు సంబంధించి నమెకానిజం పరికరాలు మార్చాలని సూచించారు. కంట్రోల్ రూంల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, లీకేజీలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన కరెంట్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఏడీఈ సుధీర్ కుమార్, ఏఈలు, సిబ్బంది ఉన్నారు.